అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన తాటాకిళ్లు



బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే పొన్నాడ

ఐ.పోలవరం: మండలంలోని తిళ్లకుప్ప గ్రామంలో గడ్డి వామికి నిప్పంటుకుని మూడు తాటాకిళ్లు దగ్ధమవ్వడంతో ఐదు కుటుంబాలు నిరాశ్రయమయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం తిళ్లకుప్పలో శనివారం అర్ధరాత్రి గడ్డివామికు నిప్పు అంటుకోవడంతో గాలికి పక్కనే ఉన్న తాటాకిళ్లకు మంటలు వ్యాపించాయి. దీంతో ఆయా ఇళ్లలో నివసిస్తున్న ఐదు కుటుంబాల సభ్యులందరూ కట్టుబట్టలతో బయటకు పరుగులు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే మంటలను ఆర్పేందుకు వారు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమివ్వడంతో అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. ప్రమాదంలో కుమ్మరి ఇందిరమ్మ, గెల్లా చిన్న సత్యనారాయణ, కుమ్మరి కుటుంబరావులకు చెందిన ఇంటి సామాన్లు, బంగారం, పాస్‌పోర్టులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని స్థానికులు చెబుతున్నారు.

బాధితులకు సాయం అందజేత

ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆదివారం ఘటనా స్థలానికి వెళ్లి అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ధైర్యంగా ఉండమని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ కుటుంబానికి ఐదు వేల చొప్పున రూ.25 వేలు బాధితులకు అందజేశారు. అలాగే జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ, వైస్ ప్రెసిడెంట్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సెక్రటరీ ముదునూరి సతీష్‌రాజులు రెడ్‌క్రాస్ తరపున బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, హైజనిక్ కిట్, స్టీల్ సామాన్లు, కూరగాయలు ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, కడియం తమ్మయ్య, సుంకర నాగబాబు, రేవు సత్యనారాయణ, మీసాల అంజి, పేరాబత్తుల వీరబాబు తదితరులున్నారు.

నేడు వీరభద్రుని వార్షికోత్సవం

యానాం: నియోజకవర్గ పరిధిలోని కనకాలపేటలో కొలువైన వీరభద్రస్వామి ఆలయంలో 47వ వార్షికోత్సవాన్ని ఈ నెల 12న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు వీరబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద వీరభద్రుని సంబరం, అనంతరం అన్నసమారాధన ఉంటుందన్నారు. దీంట్లో భాగంగా ఆదివారం నిర్వహించిన గణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

ప్రారంభమైన నక్షత్ర పూజలు



విలసవిల్లిలో సౌర యాగాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో నవగ్రహ పూర్వక నక్షత్ర పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పురోహితుడు ముస్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఋత్విక బృందం శతభిష నక్షత్ర జాతకులచే కదంబ వృక్షానికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం సౌర హోమం, గోపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గౌతమేశ్వర ఆలయంలో ఘనంగా జీర్ణోద్ధరణ



ఆలయంలో శాంతి హోమం చేస్తున్న వేద పండితులు

అల్లవరం: బోడసకుర్రు వైనతేయ నది ఒడ్డున కొలువైయున్న పార్వతీ సమేత గౌతమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వేద మంత్రోచ్చారణలతో విఘ్నేశ్వరుడు, లింగ రూపంలో ఉన్న గౌతమేశ్వర స్వామి, నందీశ్వర విగ్రహాల జీర్ణోద్ధరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో శాంతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యాంప్రకాష్, దొమ్మేటి సురేష్, చెల్లుబోయిన రమేష్, అంబటి శ్రీను, చింతా శ్రీను, చింతా బాబ్జి, చింతా బాబులు, బాబ్జి, గల్లి బాబు, మట్టపర్తి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రజకుల బల్లల పూజ



బలల్ల పూజలో పాల్గొన్న రజకులు

ముమ్మిడివరం: మండలంలోని అన్నంపల్లి రజకుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పూజ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో రజకుల నివాసాల నుంచి బాజాభజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపు నిర్వహించారు. తమ కులదేవత ఈ అమ్మ, రజకుల వీరనారి చాకలి ఐలమ్మ అమ్మవార్లకు మొక్కుబడులు, నైవేద్యాలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘ పెద్దలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు హనుమాన్ స్పెషల్ షో



హనుమాన్ సినిమాను తిలకిస్తున్న విద్యార్థులు

ముమ్మిడివరం: విద్యార్థులకు ఆదివారం సెలవు రోజు కావడంతో స్థానిక కృష్ణా థియేటర్‌లో హనుమాన్ సినిమా స్పెషల్ షో ప్రదర్శించారు. చిన్నారుల్లో ధైర్య సాహసాలు నింపేలా సినిమాను చిత్రీకరించడంతో పిల్లలకు ప్రత్యేక రాయితీపై సినిమాను ప్రదర్శించారు. ఈ షోకు వచ్చే ఆదాయంలో ప్రతి టికెట్‌కు రూ.5 చొప్పున అయోధ్య రామాలయానికి డీడీ ద్వారా పంపిస్తామని థియేటర్ యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.

కరాటే పోటీల ప్రారంభం

అమలాపురం టౌన్: పట్టణంలోని దుడ్డివారి అగ్రహారం టీసీ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి ఇన్విటేషనల్ చాంపియన్‌షిప్–2024 కరాటే పోటీలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఆదివారం ప్రారంభించారు. ఆర్గనైజేషన్ పడాల అంజి, గ్రాండ్ మాస్టర్ ఎంఎం హైదర్ ఆలీ, పి.చంటిరాజు, చిక్కాల పనసయ్యలు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

ఆలయంలో దీపాలంకరణ

తాళ్లరేవు: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం తాళ్లరేవు వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, దీపాలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజ, పారాయణం, 102 దీపాలతో అలంకరణ చేశారు. అనంతరం ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు అద్దేపల్లి సుధ, ప్రతినిధులు వరదా శేషు, అద్దేపల్లి సత్తిరాజు పాల్గొన్నారు.

బ్యాక్‌డోర్ నియామకాల రద్దుకు ఆదేశాలు

యానాం: రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ లేకుండా దొడ్డిదారిన ఉద్యోగ నియామకాలను రద్దు చేస్తూ ఆదివారం మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల నేపథ్యంలో వివిధ విభాగాల్లో అలా నియమితులై పనిచేస్తున్న సుమారు 750 మంది సిబ్బంది భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా ఓచర్ పేమెంట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగుల పర్మినెంట్‌పై హైకోర్టు ప్రభుత్వానికి ప్రశ్నల వర్షం కురిపించింది. అక్రమ నియామకాలు చెల్లవని పేర్కొంది. పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ తదితర రీజియన్లలో వివిధ విభాగాల్లో ముందుగా తాత్కాలిక నియామకాలు చేశారని, అనంతరం వీరిని పర్మినెంట్ చేస్తున్నారన్నారు. ఇటువంటి బ్యాక్‌డోర్ నియామకాలు ద్వారా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులో నమోదుచేసుకుని ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న యువకులకు అన్యాయం జరుగుతుందని చెప్పింది. కారుణ్య నియామకం ద్వారా చేరిన తమను పర్మినెంట్ చేయకుండా దొడ్డిదారిన వచ్చిన వారిని పర్మినెంట్ చేశారంటూ పుదుచ్చేరికి చెందిన అయ్యప్పస్వామి 2022లో కోర్టులో దాఖలు చేసిన పిటీషన్ విచారణ సందర్భంగా కోర్టు అధికార యంత్రాంగానికి మొట్టికాయలు వేసింది. కేసు విచారించిన జడ్జి ఎస్ఎం సుబ్రహ్మణ్యన్ నిబంధనలకు, రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా జరిగిన నియామకాలు పూర్తిగా రద్దు చేసి రెండు వారాల్లో పూర్తి నివేదికను ఇవ్వాలని ఆదేశించారు.

ఘనంగా గోల్డెన్ గ్రూప్ తొలి వార్షికోత్సవం



కోరంగి అటవీ అతిథి గృహంలో కలిసిన గోల్డెన్ గ్రూప్ సభ్యులు

తాళ్లరేవు: స్థానిక నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఏర్పాటుచేసిన గోల్డెన్ గ్రూప్ తొలి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కోరంగి అటవీ అతిథి గృహంలో పూర్వ విద్యార్థులందరూ కలిసి పాత జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఆటపాటలతో రోజంతా సరదాగా గడిపారు. అనంతరం సామూహిక సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా గోల్డెన్ గ్రూప్ ద్వారా గతేడాది చేసుకున్న తీర్మానాల ప్రకారం చేసిన సేవా కార్యక్రమాలు, ఈ ఏడాది కార్యాచరణపై చర్చించారు.

బాలవికాస్ ఒక రోజు శిక్షణ తరగతులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సమన్వయకర్త మధుసూదనరావు

అమలాపురం టౌన్: స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో జిల్లా స్థాయి బాలవికాస్ ఒకరోజు శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ గంగరాజు, డాక్టర్ రాఘవేంద్రరావులు జ్యోతి ప్రజ్వలన, పతాక ఆవిష్కరణ చేశారు. శిక్షణ తరగతుల్లో ఆదర్శ గురువు, కథలు చెప్పే విధానం, గ్రూప్ యాక్టివిటీస్, విలువలతో కూడిన ఆటలు, పేరెంటింగ్ తదితర విషయాలపై శిక్షణనిచ్చారు. జిల్లావ్యాప్తంగా సుమారు 200 మంది గురువులు, 100 మంది కన్వీనర్లు పాల్గొన్నారు. శిక్షకులుగా రాష్ట్ర విద్యా విభాగ సమన్వయకర్తలు మాధవి, మధుసూదనరావు, కిరణ్, డాక్టర్ శ్యామల, కోనసీమ జిల్లా విద్యావిభాగ సమన్వయకర్తలు గుణరంజన్, దుర్గాభవాని, కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు, జోనల్ కన్వీనర్ డాక్టర్ జీవీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పరిక్రమ యాత్ర సహ ఇన్‌చార్జిగా పవన్



పవన్‌కుమార్

అమలాపురం రూరల్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కిసాన్ మోర్చా గ్రామ పరిక్రమ యాత్ర తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జిగా అమలాపురానికి చెందిన కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం 12.30 గంటలకు జరగనున్న జేపీ నడ్డా వీడియో కాన్ఫరెన్స్‌లో పార్టీ నేతలంతా పాల్గొని ఆయన సూచనలు పాటించాలన్నారు. రైతుల వద్ద ఉన్న ఆవులు, నాగళ్లు, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలను పూజించడంతో గ్రామ పరిక్రమ యాత్ర ప్రారంభించాలన్నారు.

ఏడేళ్ల బాలుడికి రూ.21 వేల ఆర్థిక సహాయం



బాలుడి మేనమామకు ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

మామిడికుదురు: అనారోగ్యంతో బాధపడుతున్న అల్లవరం మండలం కోడూరుపాడుకు చెందిన ఏడేళ్ల బాలుడి వైద్యానికి ఆదివారం దాతలు రూ.21 వేల ఆర్థిక సహాయం అందించారు. మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 బ్యాక్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.10 వేలు, గల్ఫ్ యువనేస్తం సేవా సమితి కార్యవర్గ సభ్యులు రూ.11 వేలు వెరసి రూ.21 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ మొత్తాన్ని బాలుడి మేనమామ కడలి సాయికుమార్‌కు మొగలికుదురులో అందజేశారు. కార్యక్రమంలో దొంగ రామమోహన్, గుబ్బల గోవర్ధన పద్మ పాల్గొన్నారు.

అంగవైకల్యంతో బాధపడుతున్న వ్యక్తికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదం జరగడంతో అంగవైకల్యంతో కాలు, చేయి పనిచేయని బాధితుడికి వైద్యసాయానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.15 వేల నగదు సాయాన్ని ఆదివారం అందజేశారు. ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బిక్కిన సాయినాగదుర్గ శివగణేష్ (25) మెట్ల మీద నుంచి పడిపోవడంతో వెన్నెముకకి దెబ్బ తగిలి ఎడమ కాలు, చేయి పని చేయడం లేదు. ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్న సాయి మంచానికే పరిమితమయ్యాడు. తండ్రి కూలి పనికి వెళుతూ అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. ఉన్న ఇంటి స్థలం అమ్మేసి కొంత వైద్యం చేయించారు. అయినా పూర్తిగా కోలుకోలేదు. గుంటూరులో ఆపరేషన్ చేయించాల్సి ఉందని వైద్యం కోసం కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులను సాయం చేయమని కుటుంబ సభ్యులు కోరడంతో రూ.15 వేలు నగదు సాయాన్ని అందించినట్టు సభ్యులు తెలిపారు.

జనరల్ బాడీ సమావేశం



వైద్యుడు జాయసన్‌ను సత్కరిస్తున్న క్లబ్ అధ్యక్షుడు సత్యవరప్రసాద్

అమలాపురం రూరల్: స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళ వాకర్స్ హెల్త్ క్లబ్ సంయుక్తంగా ఎస్‌కేబీఆర్‌లో క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మెడ్ యునైటెడ్ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జాయసన్ షుగర్, కిడ్నీ వ్యాధుల గురించి క్లబ్ సభ్యులకు అవగాహన కల్పించారు. డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. అనంతరం వైద్యుడు జాయసన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సత్యవరప్రసాద్, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు భమిడిపాటి పద్మావతి, క్లబ్ కార్యదర్శి వలవల వెంకటరెడ్డి నాయుడు, క్లబ్ ఉపాధ్యక్షుడు రంకిరెడ్డి కాశి, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, యరమిల్లి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

వన్నెచింతలపూడి సొసైటీ చైర్మన్‌గా జంపన



సీతారామరాజు

అమలాపురం రూరల్: మండలంలోని వన్నెచింతలపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా జంపన సీతారామరాజు(రఘురాజు), డైరెక్టర్లుగా పరమట రామకృష్ణ, కేతా సత్యవతి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను గ్రామ సర్పంచ్ నక్కా రాజారత్నం నాగవాణి, ఎంపీటీసీ సభ్యురాలు పరమట నాగమణి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జంపన రమేష్‌రాజు తదితరులు అభినందించారు.

మున్సిపల్ సిబ్బందికి జీతాల మంజూరు

యానాం: యానాం మున్సిపాలిటీలో ఉద్యోగులకు రెండు నెలలకు గాను జీతాల సొమ్మును ప్రభుత్వం విడుదల చేసిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతేడాది జూన్, జులై నెలలకు గాను సుమారు రూ.కోటి జీతాలు విడుదల చేశారని, అదేవిధంగా మరో రెండు నెలలకు గాను రూ.96 లక్షలకు సంబంధిత ఫైలును ఆర్థిక శాఖకు పంపించామన్నారు. మరో పది రోజుల్లో ఉద్యోగుల ఖాతాలకు సొమ్ము జమ అవుతుందన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

యానాం: నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే అశోక్‌ను యానాం యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కారుమూరి పవన్, బొంతు సత్యశ్రీనివాస్, దాసరి కల్యాణ్‌బాబు, ఎన్‌వీవీ రత్నానాయుడు, హెచ్ఎంఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అదేవిధంగా పుదుచ్చేరిలో ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావును సైతం నూతన కార్యవర్గ సభ్యులు కలిశారు.

దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి

అమలాపురం రూరల్: దీనదయాళ్ ఉపాధ్యాయ 56వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, అసెంబ్లీ కన్వీనర్ బీఎస్ మూర్తి, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

యానాం: యానాం బైపాస్ రహదారి నుంచి ఆదివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం గుబ్బల వెంకన్న అనే వ్యక్తి ఆంధ్రా ప్రాంతానికి మద్యం తరలిస్తుండగా యానాం బైపాస్ రహదారిలో పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వెంకన్నను యానాం ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి పిల్లుల సంరక్షణ అందరి బాధ్యత



నీటి పిల్లుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎఫ్ఓ భరణి తదితరులు

తాళ్లరేవు: జీవ వైవిధ్యానికి ఎంతగానో దోహదం చేసే నీటి పిల్లుల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి అన్నారు. ఆదివారం కోరింగ పర్యాటక కేంద్రంలో కోరింగ వైల్డ్ లైఫ్ రేంజ్ ఆధ్వర్యంలో నీటి పిల్లుల దినోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఎఫ్ఓ భరణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన ఉండాలని, కొత్త కొత్త ఆలోచనలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. మనిషి చేసే అనేక కార్యకలాపాల వల్ల జీవజాతులు అంతరించిపోతున్నాయని, వాటిలో నీటి పిల్లులు ఒకటన్నారు. వాటిని సంరక్షించుకోవడానికి ప్రత్యేక దినోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నీటి పిల్లుల పోస్టర్లను ఆవిష్కరించారు. రెండు నిమిషాల నిడివిగల నీటి పిల్లుల డాక్యుమెంటరీని విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎంజీవీ ప్రసాద్, సిద్ధార్థ కుమార్, అరుణ వసంత, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ కె.గోపి నాగేంద్రకుమార్, మహేష్, ప్రసాద్, ధనుంజయరావు, ఆదిత్య కళాశాల ప్రతినిధులు టి.తేజేశ్వరరావు, దివాకర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే పొన్నాడ దంపతులు



పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ దంపతులు

ఐ.పోలవరం: వృద్ధ గౌతమీ నదీ తీరం ఎదుర్లంక బాలయోగి వారధి వద్ద కోనసీమ ముఖద్వారం పంచవక్త్ర విరాట్ హనుమాన్(పంచముఖ ఆంజనేయస్వామి) విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ పూజా కార్యక్రమాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం 11.12 గంటలకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దంపతులు, భూపతిరాజు బులిరాజు దంపతులచే ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, గోదృష్టి, సింధూర నాగవల్లి దళములతో పూజ నిర్వహించారు. టీటీడీ ఆగమ పండితులు సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో పలువురు పండితులచే విష్వక్సేన పూజ, రత్న శాంతి, మహా పూర్ణాహుతి జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రోత్సాహంతో స్థల దాత భూపతిరాజు బులిరాజు, పలువురు దాతల సహకారంతో నిర్మించిన సుమారు 80 అడుగుల ఆంజనేయుని విగ్రహం ప్రయాణికులను, వాహనదారులను ఆకట్టుకుంటుంది.

అభివృద్ధి పనులకు భూమి పూజ



మెట్టకూరులో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో రూ.79.60 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కనకాలపేట తిరుమలనాయుడు కాలనీలో రూ.15.05 లక్షలతో రహదారుల నిర్మాణానికి, రూ.8.80 లక్షలతో మెట్టకూరు వీకే కాలనీలో డ్రెయినేజీల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అదేవిధంగా స్థానిక న్యూబస్టాండ్ సమీపంలో ఉన్న ముస్లింల శ్మశానవాటికలో రూ.14.70 లక్షలతో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు, రూ.10 లక్షలతో సుభద్రనగర్‌లో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు, రూ.2.85 లక్షలతో మెట్టకూరు ఆదిఆంధ్రాపేటలో కమ్యూనిటీ హాలు అభివృద్ధి పనులకు, రూ.4 లక్షలతో మొండివారి వీధిలో చేపట్టే అభివృద్ధి పనులకు, రూ.19.20 లక్షలతో పరంపేట ఐఏవై కాలనీలో రహదారులు, మౌలిక సౌకర్యాల కల్పనకు ఆయన శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం



జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన షణ్ముఖప్రియ

యానాం: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆట్యాపాట్యా గేమ్స్‌లో యానాం నల్లం రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థిని చింతా దుర్గాలక్ష్మీ షణ్ముఖప్రియ బంగారు పతకాన్ని సాధించిందని చైర్మన్ నల్లం నాగబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంబైలో ఈనెల 9 నుంచి 11 వరకూ జరిగిన పోటీల్లో అండర్–14 బాలికల విభాగంలో పుదుచ్చేరి జట్టు తరపున షణ్ముఖప్రియ పాల్గొని సత్తా చాటించదన్నారు. ముంబై–పుదుచ్చేరి జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో 15 పాయింట్లతో పుదుచ్చేరి విజయం సాధించిందని చెప్పారు. ఈ సందర్భంగా షణ్ముకప్రియను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎన్ఆర్ఐ చింతా గణేష్, శివ తదితరులు అభినందించారు.

చెరువులో చేపల మృత్యువాత



పటవల పంచాయతీలో మృత్యువాత పడిన చేపలు

తాళ్లరేవు: మండలంలోని పటవల పంచాయతీలో ఉన్న ఒక చేపల చెరువులో అకస్మాత్తుగా చేపలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన కడియాల అప్పారావు రెండెకరాల చెరువులో చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నారు. అయితే ఆదివారం చేపలు చనిపోయి పైకి తేలిపోవడంతో రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులెవరో తన చెరువులో విష ప్రయోగం చేశారని, సుమారు 150 కిలోల వరకూ చేపలు మృత్యువాత పడి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ చేపల చెరువును పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. చెరువులో నీటిని ఆక్వా ల్యాబ్‌కు పంపించామని, రిపోర్టు వచ్చిన తరువాత తదుపరి చర్యలు చేపడతామని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

ఆకట్టుకున్న కళారూపాలు



అంబేడ్కర్ కళారూపాలు ప్రదర్శించిన కళాకారులు

ఐ.పోలవరం: అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం, ఆశయం, లక్ష్యం, శరణం గచ్ఛామి అనే కళారూపాలను స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో ఆదివారం ప్రదర్శించారు. అధిక సంఖ్యలో ఆహూతులు ఈ కళారూపాలను వీక్షించారు. రేవు బాలయోగి, జగడం సూర్యనారాయణ, జేవీవీ సత్యనారాయణ, రేవు ఈశ్వరరావు, నేటపాటి వెంకటేశ్వరావు తదితరులు కళారూపాలను ప్రదర్శించారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

రావులపాలెం: మాఘపౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డీఎం కేడీఎంఎస్ కుమార్ ఆదివారం తెలిపారు. నాలుగు రోజులు యాత్రగా సూపర్ లగ్జరీ బస్సు ఈనెల 22న బయలుదేరి 25వ తేదీన తిరిగి రావులపాలెం చేరుతుందన్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం టికెట్ ధర రూ.3,200గా నిర్ణయించామన్నారు. కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీకాళహస్తి, విజయవాడ మీదుగా రావులపాలెం చేరుతుందన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

అమలాపురం రూరల్: స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపిన మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వకపోవడం దారుణమని, ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు అన్నారు. జిల్లా మాదిగల జేఏసీ అధ్యక్షుడు కాప నాగభూషణం అధ్యక్షతన నడిపూడిలో జగ్జీవన్‌రామ్ భవనంలో జిల్లా మాదిగల జేఏసీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక దళితుడిని ప్రధానమంత్రి కాకుండా అడ్డుకున్న మాజీ ప్రధాని చరణ్ సింగ్‌కు భారతరత్న ఇవ్వడం దారుణమన్నారు. సమావేశంలో ఏపీసీసీ సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, దార్ల చిన సత్యనారాయణ, చాట్ల సత్యనారాయణ, తొత్తరముడి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.